క్లుప్తంగా

నేడు వీర బ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల



కర్లపాలెం: ఏట్రవారిపాలెం గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన తిరునాళ్ళ మహోత్సవాన్ని శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రామపెద్దలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 60 ఏళ్ళుగా అత్యంత వైభవంగా జరిగే ఆరాధన మహోత్సవాలు జిల్లాలోనే ఎంతో పేరు గడించాయని తెలిపారు. గ్రామంలోని భక్తులు వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి మొక్కుబడి జెండాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లపై ఉంచి ఆలయం వద్దకు చేరుకుని మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. స్వామివారి జెండాల ఊరేగింపు వెంట విచిత్ర వేషధారణలు, కనక తప్పెట్ల వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయం వద్ద విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయటంతో పాటు భక్తులకు అన్న సంతర్పణ చేస్తామని గ్రామపెద్దలు వెల్లడించారు.

బసవపున్నయ్య సేవలు చిరస్మరణీయం



భట్టిప్రోలు: స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఎం పార్టీ సిద్ధాంత కర్త కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య 32వ వర్ధంతిని పురస్కరించుకుని భట్టిప్రోలు సీపీఎం పార్టీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. బసవ పున్నయ్య జన్మించింది భట్టిప్రోలు మండలం ఓలేరు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెమని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా ఎదిగారని పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించే వారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఎం.సత్యన్నారాయణ, ఎ. శ్రీనివాసరావు, గోళ్ల నాగరాజు తదితరుల పాల్గొన్నారు.

ఒలంపియాడ్ విద్యార్థికి బంగారు పతకం ప్రదానం



తెనాలి అర్బన్ : క్రమశిక్షణతో కూడిన విద్యను అందరూ అలవాటు చేసుకోవాలని ఎంఈవో-1 మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో గోల్డ్ మెడల్ సాధించిన పదో తరగతి విద్యార్థి పల్లెకొండ ఆనంద్‌కుమార్ అ భినందన సభను చెంచుపేటలోని చైతన్య స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థికి మెడల్, సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ప్రిన్సిపల్ కె.మాధురి, విద్యార్థి తండ్రి రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు శ్రీ కాళీకామాత ఆలయ కమిటీ అన్నదానం



తెనాలి అర్బన్ : శ్రీ కాళీకామాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వై.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మేక సురేష్, కందేపి సీతారామయ్య, సీరంజన్, సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, సిహెచ్.హనుమంత్, పి.వెంకట్రావు, సుంకర రాజాబాబు, నక్కా వెంకటేశ్వర్లు, డాకా అంకిరెడ్డి పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలి రూరల్ : నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తెనాలి మండలం కొలకలూరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి వద్ద 13 క్వార్టరు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.

'మేమంతా సిద్ధం' సభకు తరలిన అభిమాన శ్రేణులు

- మండుడెండలను సైతం లెక్కచేయని జనం
- తరలింపుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు
- జగన్నినాదంతో మార్మోగిన గ్రామాలు



కొల్లూరు మండలం కిష్కిందపాలెం నుంచి సీఎం సభకు తరలుతున్న అభిమానులు

కొల్లూరు : మండుటెండలను సైతం లెక్క చేయకుండా తమ అభిమాన నాయకుడు సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' ఎన్నికల ప్రాచార సభకు ప్రజలు సైతం మేమూ సిద్ధం అంటూ రెట్టించిన ఉత్సుకతతో తరలివెళ్లారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల నుంచి బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలలో గుంటూరు సమీపంలోని ఏటుకూరు వద్ద నిర్వహించనున్న సిద్ధం సభకు అభిమానులు స్వచ్ఛందంగా తండోపతండాలుగా తరలివెళ్లారు. మండలం నుంచి సుమారు వెయ్యి మందికి పైగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ అభిమాన నాయకుడు, పేద వర్గాల పెన్నిధి సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సభకు హాజరయ్యేందుకు వాహనాల నిండుగా బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, వైఎస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీలు పాలిమట్ల ఆనందకిశోర్, బుల్లా నవరత్నం, నాయకులు కూచిపూడి మోషే, ఆళ్లమూడి మధు, కొలవరపు జేసుదాసు అయా సచివాలయాల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు బస్సులను ప్రారంభించి సభకు తరలించారు.

'మేమంతా సిద్ధం' సభకు తరలిన పార్టీ శ్రేణులు

భట్టిప్రోలు: గుంటూరులో జరిగే 'మేమంతా సిద్ధం' సభకు భట్టిప్రోలు మండలంలోని 12 సచివాలయాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక బస్సుల్లో శుక్రవారం తరలి వెళ్లారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో జరుగుతున్న 'మేమంతా సిద్ధం' సభలతో క్యాడర్లలో నూతన ఉత్తేజం వచ్చిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వేమూరు నియోజకవర్గంలో వరికూటి అశోక్‌బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి మేమంతా సిద్ధమని ఆయన తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, నాయకుల ఆధ్వర్యంలో మండలం నుంచి అధిక సంఖ్యలో సభకు తరలి వెళ్లారు.

సీఎం సభకు తరలిన అభిమాన గణం

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు సీఎం వైఎస్ జగన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న గుంటూరు సమీపంలోని ఏటుకూరులో జరుగుతున్న 'మేమంతా సిద్ధం' సభకు కర్లపాలెం మండలం నుంచి ఎమ్మెల్యే కోన రఘుపతి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న ఈ సభకు వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు మహిళలు ఆర్టీసీ బస్సులలో తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, సర్పంచ్‌లు అక్కల శ్రీనివాసరెడ్డి, మల్లెల వెంకటేశ్వర్లు, దబ్బుకూటి ఏడుకొండలు, నాదెండ్ల భానుప్రసాద్, కాగిత కరుణకుమారి, దేవరకొండ అంకమ్మ, పిట్టు నాగాంజనేయరెడ్డి, ఎంపీటీసీలు రాతంశెట్టి లక్ష్మణరావు, పులుగు సుబ్బారెడ్డి, ఆసిఫ్ అలీ, అమీర్‌బేగ్, దొంతిరెడ్డి లక్ష్మీ సామ్రాజ్యం, నాయకులు అట్ల నాగేశ్వరరెడ్డి, యారం ఇసాక్, మరుప్రోలు శివారెడ్డి, సలగల ధర్మేంద్ర, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, అట్ల అయ్యప్పరెడ్డి, కావూరి శ్రీనివాసరెడ్డి, దొంతిరెడ్డి జయభారత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



జంపని నుంచి సభకు వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జంపని(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన 'మేమంతా సిద్ధం' సభకు శుక్రవారం వేమూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో 75 బస్సుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ప్రతి మండలం నుంచి 15 బస్సులు ఏర్పాటు చేశారు.



కొల్లూరు ఎస్సీ ప్రాంతం నుంచి సభకు వెళుతున్న అభిమానులు



పెదలంక నుంచి సభకు తరలి వెళుతున్న పార్టీ శ్రేణులు



ఐలవరం నుంచి సభకు వెళుతున్న అభిమానులు



సభకు కర్లపాలెం మండలం నుంచి తరలి వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని వివిధ గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ టీ.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేటేరు, పెనుమూడి, రుద్రవరం, రావి అనంతవరం, కారుమూరు, పోటుమెరక, వడ్డివారిపాలెం, తుమ్మల, బొబ్బర్లంక, చోడాయపాలెం, గంగడిపాలెం, పిరాట్లంక, చెన్నుపల్లివారిపాలెం, లంకెవానిదిబ్బ, రాజుకాల్వ, నిర్మల్‌నగర్, అడవిపాలెం, శాంతినగర్, రాజుల చెరువు, బొందల గరువు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేమూరు: పెరవలి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఏఈ గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీరియాడికల్ మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలుపుతున్నట్లు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు పట్టణ పరిధిలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పి.ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు విఘాతం కలగనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వరికూటి ఎన్నికల ప్రచారం

చావలి(వేమూరు): వేమూరు మండలంలోని చావలి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం ఉదయం 6 గంటలకు ప్రారంభించడం జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు గాజుల హిమలత తెలిపారు. ప్రచారంలో భాగంగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పాల్గొంటారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వంద మంది వలంటీర్లు రాజీనామా

చెరుకుపల్లి: చెరుకుపల్లి మండలంలో పలు వార్డుల నుంచి 100 మంది వలంటీర్లు వారి వారి రాజీనామా పత్రాలను మూకుమ్మడిగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తికి శుక్రవారం అందజేశారు. కరోనా లాంటి కష్ట కాలంలో సైతం ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించిన తమపై కనికరం లేకుండా టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి మమ్మల్ని ప్రజల నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుళ్లపల్లి, పొన్నపల్లి, కావూరు, కుంచలవారి పాలెం, ఆళ్లవారిపాలెం, బలుసులపాలెం, తూర్పుపాలెం, ఆరేపల్లి, గూడవల్లి, ఆరుంబాక సచివాలయాల పరిధిలోని వలంటీర్లు పాల్గొన్నారు.

దుండిపాలెం(వేమూరు): చుండూరు మండలంలోని దుండిపాలెం గ్రామానికి చెందిన 9 మంది వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కు రాజీనామా పత్రాలు శుక్రవారం అందజేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు వలంటీర్లపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ రాజీనామాలు చేయడం జరిగిందని వారంతా తెలిపారు.



రాజీనామ పత్రాలను ఎంపీడీవో శ్రీనివాసమూర్తికి అందజేస్తున్న వలంటీర్లు



పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

కర్లపాలెం: మండలంలో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు వలంటీర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయటంతో పాటు ప్రస్తుత సంక్షేమ పథకాలను వలంటీర్లు పంపిణీ చేయటానికి వీలు లేదని కోర్టుకు వెళ్ళటంతో కోర్టు ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీకి దూరమైన తాము మనస్థాపానికి గురై రాజీనామాలు చేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం మండలంలోని చింతాయపాలెం సచివాలయం పరిధిలో 9 మంది, గణపవరం గ్రామ సచివాలయం పరిధిలో 18 మంది గ్రామ వలంటీర్లు తమ రాజీనామా పత్రాలు గ్రామ కార్యదర్శి వీరాస్వామిరెడ్డికి అందజేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు

కొల్లూరు : మండలంలోని కొల్లూరు, అనంతవరం, జువ్వలపాలెం, క్రాప, చినపులివర్రు, దోనేపూడి సచివాలయాల పరిధిలోని 91 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ రాజీనామాలను ఎంపీడీఓ లక్ష్మీకుమారి, ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేసి విధుల నుంచి తప్పుకున్నారు. టీడీపీ, జనసేన పార్టీలు వలంటీర్ల పట్ల వ్యవహరిస్తున్న తీరు తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని రాజీనామా చేసిన అనంతరం వారు పేర్కొన్నారు.



కార్యదర్శి వీరాస్వామిరెడ్డికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



కొల్లూరులో ఎంపీడీఓకు రాజీనామ పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

ఇంటర్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

చుండూరు(వేమూరు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో శతశాతం ఫలితాలు సాధించడం జరిగిందని ప్రిన్సిపాల్ యం లక్ష్మీనారాయణ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 41 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 41 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. సీనియర్ ఇంటర్‌లో బైపీసీ విద్యార్థి బీ సుధీర్ 927 మార్కులు, ఎంపీసీకి చెందిన విద్యార్థి సియోను 897 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఫలితాల్లో 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. 47 మంది పరీక్షలు రాయగా 45 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. గతేడాది కన్నా ఉత్తీర్ణత శాతం వృద్ధి చెందినట్లు చెప్పారు.

కర్లపాలెం: మండలంలోని పెనుమెత్స కోటం రాజు జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 45 మంది పరీక్షలు రాయగా 23 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండవ సంవత్సరంలో 45 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు.

మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 470 మార్కులకు గానూ 344 మార్కులతో పి.వీరాస్వామి కళాశాలలో మొదటి స్థానంలో నిలిచాడు. కె.పోలేరమ్మ సీఈసీలో 500 మార్కులకు గానూ 400 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. రెండో సంవత్సరం ఎంపీసీలో పీ.ఇంద్రజ 1000 మార్కులకు గానూ 761మార్కులు, ఎస్.రాజశేఖర్ 1000 మార్కులకు గానూ 730 మార్కులు సాధించారు. సీఈసీలో పీ.వేణుగోపాల్‌రెడ్డి 1000 మార్కులకు గాను 561మార్కులు సాధించినట్లు కళాశాల యాజమాన్యం వెల్లడించింది.

వేమూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో 54 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపాల్ గాయత్రి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 28 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 12 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 15 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు తాగునీరు విడుదల

కొల్లూరు : తాగునీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు నీటి పారుదల శాఖాధికారులు నీటి విడుదలను చేపట్టారు. సీతానగరం ప్రధాన కాలువ నుంచి పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు ప్రస్తుతం 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో శుక్రవారం కొల్లూరు లాక్‌ల నుంచి దిగువ ప్రాంతానికి సిబ్బంది నీటిని విడుదల చేశారు. రేపల్లె, నగరం ప్రాంతాలలోని తాగునీటి చెరువులు నింపుకునేందుకు ఈ నీటిని వినియోగించనున్నట్లు సంబంధిత శాఖ సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన నీటికి అదనంగా మరో 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు నీటిని విడుదల చేయడంతో అడుగంటిన భూగర్భ జలాలు మెరుగుపడి నీరు రాకుండా మొరాయిస్తున్న మంచినీటి పంపులు, విద్యుత్తు మోటర్ల ద్వారా నీరు లభ్యత మెరుగయ్యే అవకాశాలుంటాయని డెల్టా ప్రాంతంలోని పలు మండలాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ లాక్‌ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

సీఎం వైఎస్ జగన్ పాలన చారిత్రాత్మకం

రేపల్లె రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని రాజ్యసభ సభ్యుడు తనయుడు మోపిదేవి రాజీవ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ తనయుడు డాక్టర్ సృజన్‌లు అన్నారు. రానున్న ఎన్నికల సందర్భంగా పట్టణంలోని 24వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన దిశగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌లకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్త, కౌన్సిలర్ బేతపూడి కోటేశ్వరరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ బేతపూడి వెంకట మహాలక్ష్మి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులతో పోటెత్తిన సూర్యలంక తీరం



సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులు

సముద్ర స్నానాలకు తరలివచ్చిన ముస్లిం సోదరులు

బాపట్ల టౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని పండుగ తర్వాత రోజు రాష్ట్రం నలుమూలల నుంచి ముస్లిం సోదరులు సూర్యలంక తీరానికి చేరుకొని తీరంలో పుణ్యస్నానాలు ఆచరించడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా శుక్రవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గతంలో ఎన్నడూ లేని రీతిలో అధిక సంఖ్యలో వారంతా సూర్యలంక తీరానికి చేరుకున్నారు. పవిత్రమైన రంజాన్ మాసంలో సముద్రస్నానాలు ఆచరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తే ఏడాది అంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారనేది వారి నమ్మకం. దీంతో సుదూర ప్రాంతాల నుంచి ముస్లిం సోదరులు వివిధ వాహనాల ద్వారా కుటుంబ సమేతంగా తీరానికి చేరుకున్నారు. దీనికి తోడు ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటం, ఉదయం అక్కడక్కడా చిరుజల్లులు కురిసినప్పటికీ మధ్యాహ్నం నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో ముస్లిం సోదరులు తీరానికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. సముద్రస్నానం అనంతరం తీరం వెంబడి ఉన్నటువంటి జీడిమామిడి తోటల్లో వన భోజనాలను చేశారు. ఒక్కసారిగా ముస్లిం సోదరులు భారీ స్థాయిలో చేరుకోవడంతో సూర్యలంక సముద్రతీరం కిక్కిరిసింది.

రాష్ట్ర నలుమూలల నుంచి సూర్యలంక, నిజాంపట్నం, ఓడరేవు సముద్ర తీరాలకు వేల సంఖ్యలో విచ్చేసిన ముస్లిం సోదరులకు తిరుగు పయనంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బాపట్ల డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు సూర్యలంక సముద్రతీరం నుంచి బాపట్ల పట్టణం వరకు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఓడరేవునుంచి చీరాల వరకు ఎక్కడా ట్రాఫిక్ సమ స్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి కేపీ బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మే 11వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశగా లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాజీ కాదగిన సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్, వాహనాలు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు.

సొంత గూటికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు


కర్లపాలెం: పేరలి గ్రామం నుంచి ఇటీవల తెలుగు దేశం పార్టీలో చేరిన యువకులు శుక్రవారం బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ కోన నిఖిల్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయటం జగనన్నకే సాధ్యమని గుర్తించి తిరిగి వైఎస్సార్ సీపీలోకి చేరామని చెప్పారు. కోన నిఖిల్ మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పరిపాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అందాయని ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అర్హతలను బట్టి సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, నాయకులు ధర్మేంద్ర, చిరంజీవి, అర్జున్‌రెడ్డి గొర్రుముచ్చు మీరయ్య, బెనర్జి, కొండలు తదితరులు ఉన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు

భక్తిరస రాముని కీర్తనలకు హృద్యమైన నృత్యం

తెనాలి : పట్టణ నాజరుపేట కొల్లూరు వారి వీధిలో గల శ్రీసీతా రామాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీక్రోధి నామ సంవత్సరం ఆరంభమైన ఈనెల 9వ తేదీనుంచి 40వ వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుపుతున్నారు. శ్రీస్వామివారికి నిత్యార్చనలతోపాటు గాత్ర కచేరీలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.గురువారం రాత్రి కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి. అకాడమీ అధినేత, ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి శిష్యబృందమైన 36 మంది చిన్నారులు వివిధ నృత్యాంశాలను ప్రదర్శించారు. అవన్నీ భక్తి రస రాముని కీర్తనలే కావటం విశేషం. చిన్నారుల నృత్యాభినయాన్ని భక్తులు, ఆలయ కమిటీ బాధ్యులు అభినందించారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు